# భ్రాంతి

వై. లక్ష్మీ రాఘవ్



ఎంతకీ తెగని ఆలోచనలకి ఒక ఫుల్‌స్టాప్ పెట్టి నెమ్మదిగా వంటింటివేపు నడిచింది రాధిక. కుంపటి ముందు అమ్మకెదురుగా పీట మీద చతికిలబడింది. అదే సమయానికి గడియారం నాలుగు గంటలు కొట్టింది. లేని ధైర్యాన్ని కూడతీసుకుంటూ "అమ్మా" అంది, అతిమెల్లగా ఏనాడూ ఒద్దికగా కూర్చుని ముచ్చటగా కబుర్లుచెప్పే అలవాటులేని కూతురు, వంటింటి ఛాయలకు పొరపాటునైనా తొంగిచూడ నిచ్చగించని చిలిపి రాధ యిలావచ్చి తీరుబాటుగా కూర్చోవడమే గమనిస్తోంది సుశీలమ్మ.

రాధిక పిలుపుకి మరింత ఆశ్చర్యపడినా అది కనబడనీకుండా పెనంమీద పెసరట్టుపోస్తూ, ''ఏమిటే?'' అంది తాపీగా. అదేమిటో చెప్పాలనే వచ్చినా తీరా జరగబోయే ఫలితాన్ని ఊహించగా వచ్చిన దుఃఖం గొంతుకు అడ్డుపడి మాట రానివ్వటంలేదు, పొడారిపోయిన కంఠాన్ని సవరించుకుంటూ దీనత్వాన్ని కప్పిపుచ్చుకుంటూ "26వ తారీఖున మా జయంతి పెళ్ళటమ్మా! నిన్న శుభలేఖతోపాటు మరీమరీ రమ్మంటూ ఉత్తరం కూడా రాసింది" ఆశగా తల్లివేపు చూచింది రాధిక. కూతురి మనోభిప్రాయం తెలిసినా తెలియనట్టే ''అలాగా! అయితే వాళ్ళ బావతోనేనా? పెళ్ళయాక ఉద్యోగం చేస్తుందా?" అంటూ యథాలాపంగా అంది. రాధిక లేని ఉత్సాహాన్ని తెచ్చుకుంటూ ''ఏమో చేస్తుందేమోలే. బావేగా అంగీకరిస్తాడనుకుంటాను" అంది. సుశీలమ్మ యింకేం ప్రశ్నలు వెయ్యలేదు. కాని, రాధిక ఆతృత కప్పిపుచ్చుకోలేకుండా ఉంది.

ఎర్రగా కాలుతున్న పొయ్యివంక చూస్తూ ''అమ్మా! జయ పెళ్ళికి నే వెళ్తా" అంది అతి మెల్లగా. సుశీలమ్మ అట్టు తిరగవేస్తూ ప్రారంభించింది. ''బాగుందమ్మా! దగ్గరా! దాపా! మాటలేమిటి వెళ్ళడం అంటే..." అంటూ కూతురు వేపుచూసి ఆనేసిందామె. రాధిక మొహంలో దుఃఖపుఛాయలు పేరుకొంటున్నాయి. చూపులు విశ్శృలంగా నిలిచిపోయాయి. అవి కదిపితే కడివెడునీళ్ళు ఒలకబోసే ట్టున్నాయి కళ్ళు. ఉద్వేగంతో ఎరుపెక్కాయి బుగ్గలు. మిగతా అభిప్రాయం చెబితే రాధిక బిగ్గరగా యేడ్చేస్తుందేమోనని భయపడింది సుశీలమ్మ.

''ఆఫీసునుంచి నాన్నగారొచ్చాక చెప్తాలే! ఏమంటారోమరి" అంది. రాధిక యింకక్కడ కూర్చోలేకపోయింది. ఉబికివస్తున్న దుఃఖాన్ని పెదవులతోనే అణచుకుంటూ గదిలోకిపోయింది. కన్నీళ్ళు ఏకధారగా చెక్కిళ్ళమీంచి జారిపోయాయి. గతం ఆమె మనసులోకి జొరబడి బాధని రగిలిస్తోంది. చిన్నప్పటినుంచీ జయంతి, రాధిక కలిసి చదువుకున్నారు, దేహాలు వేరయినా ప్రాణం ఒక్కటిగా మెలిగిన ఆత్మీయులు, కాం

గర్భంలో తమ్మని స్నేహాలు చాలా కరిగి పోతుంటాయి. అలా తమ స్నేహం కరిగిపో కూడదనీ, కలకాలం నిలుపుకోవాలనీ ప్రమాణాలుకూడా చేసుకున్నారు. చిరుత ఊహలనుంచి పరువం తెచ్చిన పరిమళం లగాయితూ తీగెసాగిన స్నేహం పందిరిలాంటి మనసువిండా అల్లుకుని పూలు పూచింది.

కాలధర్మం తప్పించుకోవడం వారి శక్యం కాలేదు. రాధిక తలిదండ్రులతో మరో వూరు రాక తప్పలేదు. అయినా వారిద్దరి మధ్యా ఉత్తరాలు తృప్తినిస్తున్నాయి. జయంతి పెళ్ళి తల్చుకోగానే రాధిక హృదయం ఉప్పొంగింది. తన జయ జీవితంలో మధురాతి మధురఘట్టం, మరుపుకురాని దృశ్యం, తనులేకుండా జరిగిపోవడం ఎంత బాధాకరం. పవ్వని జయ గంభీరంగా ఉండే జయ - తన విశాల నేత్రాలతో ప్రేమగా తనను చూసే జయ పెళ్ళికూతురిగా మారితే తను చూడకుండా ఉండటం ఎలా? తమ స్నేహం, తమ యిద్దరి మధ్యవున్న ఆత్మీయత, అనుబంధం అన్నీ తెలిసిన ఈ పెద్దవాళ్ళకు ఇది ఎందుకు అర్థంకాదు? బాధతో తలను పట్టుకుంది రాధిక.

హాల్లో చెప్పుల శబ్దం విన్పించింది. ఆశతో రాధిక హృదయం చలించింది. బట్టలుమార్చుకు కాళ్ళు కడుక్కొని పీటమీద కూర్చున్న భర్తకి, ఫలహారం పెట్టి నిల్చుంది సుశీలమ్మ. కళ్ళు తుడుచుకుని ఆశ నిరాశల మధ్య దడదడలాడే గుండెలను చిక్కబట్టుకొని నిల్చుంది రాధిక. సుశీలమ్మ చిన్నగా నవ్వుతూ "జయంతి పెళ్ళి 28 న టండీ" అంది భర్తతో. పెసరట్టు నోట్లో పెట్టుకొంటూ "ఓహో అలాగా! రాధీ ... రాధీ ...అని కేక వేశాడు ఆయన."అదిగో మీవెనకా నిల్చుంది. ఇంతసేపూ, జయ పెళ్ళికి వెళ్తాను. వెళ్తానని ఎగిరిందానివి అక్కడే నిల్చున్నావేమే యిలాగా!" అంది సుశీలమ్మ. రాధిక బెరుకుగా తలవంచుకు వచ్చి నిల్చుంది. ఒక్కసారి కూతుర్ని నిలువెల్లాచూచి నిట్టూర్చాడాయన. "చూడమ్మా రాధీ! జయంతి పెళ్ళికి వెళ్ళడమే సరిపోదు. ఏదైనా బహుమతి కూడా తీసుకెళ్లాలి కదా! అంతడబ్బు యిప్పుడెలా వస్తుంది?" నచ్చచెప్పటానికి ప్రయత్నిస్తూ అన్నాడాయన. నాన్నగారి మాటలు చెవులపడగానే రాధిక ఇక అక్కడ నిలువలేకపోయింది. నిరాశ, ఆశక్తత, ఉక్రోషం అన్నీ ఒకసారే ముంచుకొచ్చాయి. గిర్రున తిరిగి గదిలోకివెళ్ళి పరుపుమీద వాలిపోయింది. పెల్లుబికిన దుఃఖం తలగడను వెల్లువలా ముంచేసింది.

ఎంత ఏడ్చినా గుండెల్లో బరువు తీరనేలేదు. ఏవరినీ అనలేని అశక్తురాలు తను. తనకే స్వతంత్రం ఉంటే తనే ఉద్యోగం చేస్తూ తన కాళ్ళమీద తాను నిలబడగలిగితే యిలా జరిగేదా? దర్జాగా పెద్ద ప్రెజెంట్‌తో, నిండుగా ముస్తాబై రాణీలా తీవి, అందం ఒలకబోసే జయంతి బుగ్గలుగిల్లి ఆనందంగా ఆమె వివాహం జాడగలిగేది. లేనిదాన్ని ఊహించుకు నిట్టూర్చింది రాధిక. తను ఉద్యోగస్థురాలై సర్వ స్వతంత్రురాలైనప్పుడు తప్పక జయంతిని చూస్తానని నిశ్చయించుకుని భవిష్యత్తుమీద భరోసాతో జవాబు వ్రాసింది జయంతికి. ఆ చక్కని కాలం కోసం తనప్రియాతిప్రియమైన నెచ్చెలి సన్నిధికోసం వేయి ఆశలతో ఎదురుచూచి సాగింది రాధిక.

కాలం ఆగకుండా సాగిపోతూనేవుంది. నాలు సుదీర్ఘ సంవత్సరాలు గడిచిపోయినై. రాధిక జీవితంలోనూ,కుటుంబంలోనూ ఎన్నో మార్పులు వచ్చినై. ఎలాగో శ్రమపడి తండ్రి రాధికను బి. ఏ. చదివించాడు. అ డిగ్రీ రాధికొక చిన్న ఉద్యోగం సంపాదించిపెట్టింది. ఆమె కూడా యిప్పుడు సంపాదన మొదలుపెట్టింది. కాని యిప్పటికీ జయంతిని చూడాలనే కోరికగానే మిగిలిపోయింది.

సంక్రాంతికి రాధికను తప్పక ఇంటికి రమ్మని తండ్రి ముందుగా ఉత్తరం రాశాడు. సంక్రాంతికి ఇంటికి వెళ్ళినపుడు తప్పక జయంతి దగ్గరకు వెళ్ళాలనుకుంది రాధిక. కాని. అక్కడికివెళ్ళిరావాలంటే కనీసంవందరూపాయలైనా పట్టుకోవాలి. రాధిక ఎంతో పొదుపుగా ఖర్చుపెటడం సాగించింది. ఆమె ఆలోచనలు నెల్లాళ్ళ ముందునుంచీ జయంతి చుట్టూ పరిగిడుతున్నాయి. "నిండునెలల గర్భిణి జయ. తనను చూడగానే పరుగెత్తుకు రాలేదు. భారంగా.నెమ్మదిగా కదిలివస్తుంది, మాతృమూర్తిని కాబోతున్నానన్న గర్వంతో ఆ కనులు తళతళమంటుంటాయి. ఇన్నేళ్ళ ఎడబాటు తర్వాత కలుసుకొంటున్న తామిద్దరికి చెప్పుకోటానికి ఎన్నెన్నో కబుర్లు, ఇలా తలపోసుకుంటూ ఎంతో మురిసిపోయింది రాధిక. అసలు జయంతి ఎంత మారిపోయి వుంటుందో! బంగారు తీగెలా సన్నగా నాజూగ్గావుండే జయంతికి ఒళ్ళు వచ్చిందంటే ఎలా వుంటుందో! అసలే సన్నని ఆమె చిరు నడుము లావెక్కితే ఎలా వుంటుందో!ఎప్పుడూ



మేకా గోపాలరావు

ఫొటో: ఎస్. గిరిధర్. కాకినాడ

షావుకారు నరసయ్య : ఏమండీ హనుమంతరావుగారూ మా బాకీ కొంచెమైనా చెల్లుపెడతారా లేదా?

హనుమంతరావు : అయ్యా నా పరిస్థితి బాగులేదు...

షావుకారు : ఏమో. మీరు కొంచెం చెల్లుపెట్టేరా సరి, లేకపోతే మీ మిగతా బాకీదార్లందరికి మీరు మాబాకి పూర్తిగా చెల్లుపెట్టేరని చెప్పేస్తాం.

## భ్రాంతి

చిలిపిగా చలాకీగా, తిరిగే జయ గంభీరంగా, మందగమనంతో తిరుగుతుంటే చూడ ఎంత వింతగా వుంటుందో! ఇలా అనంతంగా సాగిపోతున్నాయి రాధిక ఆలోచనలు. రాత్రులు కలలలో జయంతితో కబుర్లాడకుండ తెల్లవారిన రోజులు లేవు. ఆవేగం, ఆతృత ఆమెని నిలవనీయడం లేదు...

చల్లగా నవ్వింది సౌభాగ్యలక్ష్మి. విసురుగా సాగే చలిగాలులు, కొంటెనెచ్చెలులు వెచ్చని బుగ్గలను చలబరిచి మధురంగా నవ్వుతున్నాయి. చామంతులు తలలూపుతూ రారమ్మని పిలుస్తున్నాయి. రాధిక, అన్నీ సర్దుకు ప్రయాణమైంది. ఇంక నాలుగు రోజులు ఓపికపట్టి నిరీక్షిస్తే ఈ చలిగాలుల పొగరణిగేలా వెచ్చని శాలువా ముసుగులో నులువెచ్చని జయంతి మురిసిపోయే కబుర్లతో మునిగిపోవచ్చు. వేయి ఆశలతో, కోటి కోరికలతో సన్నజాజి తీవెల్లా ఊహాలతీగెల పందిరి నల్లుకుంటూ ఇల్లు చేరింది రాధిక.

చెల్లాయిల కబుర్లు, తమ్ముడి ముచ్చట్లు, అమ్మ నాన్నల వాత్సల్యం, అన్నయ్యల పలకరింపులు బావల వేళాకోళలతో సంక్రాంతిలోని పరిపూర్ణ ఆనందం తాండవిస్తోంది. రెండురోజులు రెండు క్షణాల్లా గడిచిపోయేయి. ఇంక జయంతిని చూచిరావాలి అనే ఆరాటం మళ్ళీమొలకెత్తింది రాధికలో. ఇపుడు తను వెళ్తానంటే వద్దనరనే ధైర్యం పూర్తిగా వుంది రాధికకి. అందుకనే రాత్రి భోజనాల సమయంలో మెల్లగా అంది.

"రేపు బయల్దేరి వెళ్ళి జయంతిని చూచిరావాలి" అని, అమ్మ మాట్లాడలేదు. తలఊపి ఊరుకుంది. తృప్తిగా నిట్టూర్చి గదిలోకి వెళ్ళింది రాధిక.

రాధిక చిన్నచెల్లెలు శైలు దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చుంది ఆ గదిలోనే. రాధిక మంచం మీద కూర్చోగానే సంశయంగా మెల్లగా 'అక్కా' అని పిల్చింది. కమ్మని ఊహాలతో మేడలుకడుతున్న రాధిక ఉలిక్కిపడింది. చెల్లెలు ముఖం చూడగానే కంగారుపడింది. శైలు కనుకొలుకుల్లో నీరుతళతళ మెరుస్తోంది. 'ఏమిటిశైలూ?' హృదయాంతరాళాల్లో దాగివున్న అనురాగమంతా పైకి పొంగింది. తలవాల్చుకున్న శైలు మెల్లగాఅంది. "వనజకీ నాకు యిద్దరికీ ఒకసారి పరీక్షఫీజు కట్టలేక నన్ని ఏడాదికి ఆగిపొమ్మన్నారు నాన్నగారు. మరొక యేడాది ఆగితే నేనింక చదవలేనక్కా..నాకు చిన్నతనంగా ఉంటుంది. "ఆగిఆగి తనబాధ వెళ్ళబోసుకుంది. చిన్నబోయిన చెల్లెలి ముఖంచూచి రాధికమనస్సు చివుక్కుమంది. ఆ సమస్యను ఏదోవిధంగాతను పరిష్కరించగలదు. అలాఅయితేఇప్పట్లో ఇకజయంతిని చూడటంపడదు. అంతా తెలిసికూడా తనకు ఏమీ తెలియనట్లు జయంతిని చూడటానికివెళ్ళినా అందులో తృప్తివుండదు. ఎటూ తేల్చుకోలేక సరే! చూద్దాంలే! నువ్వెళ్ళి పడుకో" అంటూ మంచంమీద వాలిపోయింది రాధిక. ఇన్నాళ్ళు తాను అల్లుకున్న ఆశలు, జయంతిని చూడాలి అని కన్న కలలు యేమవుతాయి? శైలు మనసు తెలిసివుండి తృణీకరించడం? జయంతిని మరోసారి చూద్దామనుకున్నా వస్తానని తనకీ వ్రాసి మళ్ళీ వెళ్ళకపోతే ఆమెకు ఆశాభంగం కలిగించినట్లు కదూ? 'భగవాన్! పరిస్థితులకు లొంగంది ప్రపంచంలో ఏదీ లేదు. బాధ్యతకన్నా కోరిక గొప్పది కాదు. నేనింతకే నోచుకున్నాను." అనుకుని మనసుకి సమాధానం చెప్పుకుంది రాధిక.

మర్నాడు ఫీజుకు కావలసిన డబ్బు చెల్లెలి చేతిలో పెడుతూ ఆమె మొహం చూసింది. ఎర్రవారిన శైలు కళ్ళు ఆనందంతో కృతజ్ఞతతో మెరిసిపోయాయి బరువుగా నిట్టూర్చింది. రాధిక. పసితనం. ఈ పసితనంలోనే పెద్దవాళ్ళ బాధ్యతలు గుర్తించకుండా తనని జయంతి పెళ్ళికి పంపలేదని ఉక్రోషంతో ఏడ్చింది. బాధ్యతలే బరువులై కోరికలకు అడ్డుపడతాయి అనుకుంటూ నెమ్మదిగా కదిలిపోయింది రాధిక.

రైలుకు టయిమవుతున్నా కదిలికలేని రాధికను "ఏమే రాధీ! వెళ్ళవా యేమిటి?" అంది సుశీలమ్మ. "లేదమ్మా మరోసారి ఎప్పుడైనావెళ్తాన్లే" అంది రాధిక బాధగా.

(కలకత్తా ఆంధ్ర సంఘం (1968) సావనీరు సౌజన్యంతో)


పొడుగు పెరగండి!

"WHE N TU E FAILS"

ప్రపంచ ప్రఖ్యాతి పొందిన మా "హైటెక్స్" "Hytex" ఔషధంఉపయోగిస్తే మీరుగ్యారంటీగా 2 నుంచి 6 అంగుళముల వరకు పొడుగు పెరగగలరు. ఏ వయస్సులో వున్నా పరవాలేదు. స్త్రీ, పురుషులు పుచ్చుకోవచ్చు. ఒక ఫియల్ వెల 20 Tabs. రూ. 3—75. పోస్టేజి అదనం.

నెరిసిన వెంట్రుకలను పోగొట్టుకోండి

మా నిరపాయకరమైన, సువాసనగల "బాల్ కాలా తేల్ "BAL KALA TEL" తెల్లవెంట్రుకలు శాశ్వతంగా వ్రేళ్ళతోసహా నల్లబడేలా చేస్తుంది. ఒకఫియల్ వెల రూ. 3-75. పోస్టేజి అదనం 3 ఫియల్స్ వెల రూ. 7-50.

ఉత్తరములు ఆంగ్లంలో వ్రాయుండి.

Correspondence in English

మే. UNITED COMMERCIAL Co

Beat No. 29

A.W.V. 15 Post No. 3863

AMBALA CANTT (N. India)


## ఎవరు నీవు?

నీ చుట్టూ వేలకొలది
నీడలేని నిర్భాగ్యులు
వెతచెందుట గమనిస్తే
గతిలేకను విలపిస్తే
నీ కనుపాపల లోపల
నీలోనే కనిపిస్తే

సౌధాంతరమున చక్కని
శయనాగారమ్మునందు
నిశ్చింతగ పవళించే
నిస్సంగుడవా చెప్పుము?

★

పట్టెడు కబళమ్మనకై
పడిగాపులు పడి బడలుచు
పస్తులుండు అన్నార్తులు
నీ చుట్టూ నిలుచుంటే
నీ కనుపాపల లోపల
నీలోనే కనిపిస్తే

పాటించక, చేటెంచక
పలువిషయాసక్తుడవై
వినోదించు సాహసివా?
వివేకశూన్యుంగుడవా?

నీ వెవరవు? మానవుడవె!
నిజము చెప్పు నీ వెవ్వరు?

"మనూనా"